క్లుప్తంగా

మిర్చికి రూ.50వేలు ధర కల్పించాలి



మిరపను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కౌతాళం: ఎంతో కష్టపడి పండించిన మిరప పంటకు గత రెండు సంవత్సరాల నుంచి సరైన ధర లేక రైతుల దివాల తీస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని క్వింటాలకు రూ.50వేలు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్నలు డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో పంటల పొలాలను పరిశీలించి మిరప రైతులతో మాట్లాడారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆదివారం మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతులు ఎల్లప్ప, కృష్ణ, అయ్యన్న, రాముడు, ఉరుకుందులు మాట్లాడుతూ గ్రామంలో 500 ఎకరాలకు పైగా మిర్చి పంట సాగు చేశామని, ఎకరాకు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టామని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో మిర్చి పంటకు గిట్టుబాటు ధర ఉండేదని, ఇప్పుడు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గిట్టుబాటు కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

కర్ణాటక మంత్రిని కలసిన దొరల వంశస్తులు



మంత్రి బోసురాజును కలిసిన దొరల కుటుంబ సభ్యులు

కోసిగి: కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ అండ్ సైన్స్ శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజును కోసిగి దొరల వంశస్తులు దివంగత మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రాజు దొర కుమారులు శ్రీనివా స రాజు దొర, మురళీ కృష్ణం రాజు దొర మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా నుంచి ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రానికి వెళ్తున్న మంత్రి కోసిగిలో దొరల ఇంటి వద్ద ఆగారు. దొరల వంశస్తులను పలకరించి రాజకీయ పరిణామాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనను దొరలు శాలువా, పూలమాలలతో సన్మానం చేశారు. రాయచూరు మేయర్ జయన్న, శాంతప్ప, సతీష్, అభి, చేతన్ పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

కోసిగి: మండల కేంద్రంలోని భూగేని చెరువు వద్ద తాగునీటి సంప్ మోటార్లు, రెండు బోరు మోటార్లు లోటట్టేజ్‌తో శనివారం ఉదయం మరమ్మతులకు గురయ్యాయి. వెంటనే గ్రామ సర్పంచ్ అయ్యమ్మ స్పందించి కోసిగి ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ సిబ్బందితో కలిసి సాయంత్రం లోగా తాగునీటి మోటార్లు, బోరుకు మరమ్మతులు చేయించి యథావిధిగా నీటి సరఫరా చేయించారు.

రేపు స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఈనెల 11వ తేదీన ఆదోని అవోపా, ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా ఆదివారం తెలిపారు. ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉదయం 7 గంటలకు ఈ మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. 9849478178 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించి 10వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

సీనియారిటీ జాబితా అవకతవకలపై విచారణ జరపాలి

ఆదోని రూరల్: విద్యుత్‌శాఖ కర్నూలు సర్కిల్‌లో 2007 బ్యాచ్ ఉద్యోగుల సీనియారిటీ జాబితాలో అవకతవకలపై విచారణ జరపాలని బాధితులు కర్రెన్న, టి.భాస్కర్, రత్నకుమార్, కాజాబాషా, నిజాముద్దీన్, రాజ్‌కుమార్ తదితరులు కోరారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఏపీసీపీడీసీఎల్ కర్నూలు సర్కిల్‌లో వయస్సు, సీనియారిటీ ఆధారంగా 204 కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేశారన్నారు. వీరు 2007లో విధుల్లో చేరగా.. ఇందులో 14 మంది 2008లో నంద్యాల డివిజన్ నుంచి ఆదోని డివిజన్‌కు బదిలీపై వచ్చారన్నారు. హైకోర్టు తీర్పు మేరకు 2011లో కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. అయితే 2011లో విధుల్లో చేరిన వారికంటే 2008లో నంద్యాల నుంచి వచ్చిన వారిని జూనియర్లుగా పరిగణిస్తూ సీనియారిటీ జాబితాను నోటీసుబోర్డులో వేశారన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. రాజ్‌కుమార్, రంజాన్, కృష్ణయ్య, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయాసం భరించలేక ఆత్మహత్య

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం యాటకల్ గ్రామానికి చెందిన నాగన్న(70) అనే వృద్ధుడు దమ్ము, ఆయాసం తాళలేక ఆదివారం పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి కొన్ని రోజులుగా ఆయాసం ఎక్కువగా ఉండటం, ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుమందు సేవించాడు. బంధువులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ మృతిచెందినట్లు టౌట్ పోస్టు పోలీసులు తెలిపారు.

అటకెక్కిన హామీలు

- అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా అమలు కానీ సూపర్‌సిక్స్ పథకాలు
- కూటమి నేతలకు మేలు చేకూర్చే స్కీములు మాత్రమే అమలు
- మోసపోయామనే భావనలో జనం
- ప్రజల దృష్టి మరల్చేందుకు తెరపైకి ఏదో ఒక అంశం



గంజిహళ్లి హంద్రీలో ఇసుకను అక్రమంగా తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్లు (ఫైల్)

గోనెగండ్ల : ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరిట హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలలు కావస్తున్నా వాటిని అమలు చేయడంలేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు మోసపోయామని గుర్తించి మదనపడుతున్నారు. ఇచ్చిన హామీలను పక్కన పెట్టి జనం దృష్టిని మరల్చేందుకు ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెస్తూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శిస్తున్నారు.

55 వేల మంది ఓటర్లు

మండలంలో దాదాపు 55 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో దాదాపు 28వేల మహిళ ఓటర్లున్నారు. వీరిలో 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వారికి ఏటా రూ.18వేలు ఇస్తామన్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరిట ఏడాదికి రూ.15వేలు ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తామని మాటిచ్చారు. ఇక ఉచిత గ్యాస్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అంటూ ఆశలు కల్పించారు. అయితే ఇందులో ఉచిత గ్యాస్ తప్ప ఏదీ అమలుకు నోచుకోలేదు. అమలు చేసినా పథకంలోనూ నిబంధలతో చాలా మందికి లబ్ధిచేకూరడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అన్నదాతలకు అగచాట్లు

మండలంలో 16వేల మంది రైతులు ఉన్నారు. కూటమి ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థికసాయం ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇంతవరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. పైగా పంటలకు గిట్టుబాటు ధర కలిస్తామని చెప్పి ఇప్పుడు చేతులెత్తేశారు. దీంతో పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టానికి అమ్ముకోవాల్సిన దురిస్థితి నెలకొంది. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేసేది. కూటమి ప్రభుత్వం ఉచిత బీమాకు మంగళం పాటి రైతులే ప్రీమియం చెల్లించేలా పథకాన్ని అమలు చేస్తోంది. దీంతో అదనపు భారం పడుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

ఎవరికి ప్రయోజనం దక్కిందంటే..

కూటమి పేరు చెప్పుకొని మండలంలో ఇసుకాసురులు ట్రాక్టర్లతో వందల లోడ్లు ఇసుకను అమ్ముకుంటున్నారు. మద్యం సిండికెట్ ద్వారా కూటమి నేతలకు మేలు చేకూరింది. ఏటు చూసిన బెల్టుషాపుల ద్వారా ఆ ఆపార్టీ కార్యకర్తలకు ఆదాయాన్ని కల్పించారు. నాయకులకు సీసీ రోడ్లు పనులు కేటాయించారు. ఇక యథేచ్ఛగా మట్టిని తోలుకొనే అనధికారిక హక్కును కల్పించారు. మొత్తం మీద కూటమి సర్కారు ఏడు నెలల పాలనలో వీరికి మాత్రం లాభం చేకూర్చి అన్ని వర్గాలను మాయదారి హామీలతో ముంచేసి చెవిలో పూలు పెట్టారనే మాట మండలంలో గట్టిగా వినిపిస్తోంది.

కొండెక్కిన నిరుద్యోగభృతి

మండలంలో 5వేల మందికిపైగా నిరుద్యోగ యువతీ,యువకులు ఉన్నారు. వీరు వివిధ కోర్సులు చేసి ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కోటి మందికి ఉద్యోగాలు కలిస్తామని లేదంటే నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికలప్పుడు మాటిచ్చారు. దీంతో వేలమంది నిరుద్యోగులు స్థానికంగా ఎదురుచూస్తున్నారు. ఇక వలంటీర్లకు నెలకు పది వేల వేతనమంటూ ఆ వ్యవస్థకే మంగళం పలికారు. ఏదీమైనా సూపర్‌సిక్స్ పేరిట కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఎప్పుడిస్తారు ?



ఎన్నికల హామీలలో భాగంగా కూటమి నాయకులు రాష్ట్రంలో కోటిపైగా ఉద్యోగాలు కల్పిస్తామని, లేకపోతే నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఇప్పటి వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా నిరుద్యోగభృతి ఇవ్వలేదు. నిరుద్యోగభృతి కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగభృతి ఇవ్వాల్సిందే. – రజియా సుల్తానా, గోనెగండ్ల

ఉచిత బస్సు ఒట్టిమాటేనా?



గెలిస్తే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పడం వట్టిమాటేనా?. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పడం, ఆ తరువాత దీపావళి అని, సంక్రాంతి కానుకగా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తామని ఇలా పూటపూటకో మాట చెప్పి మహిళలను మభ్య పెట్టడం మంచిది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. ఇప్పటి వరకు సూపర్ సిక్స్‌లోని పథకాలనే అమలు చేయలేదు. కూటమి నేతలు ఇలా మయమాటలు చెప్పి ఇంకా ఎన్ని నెలలు పబ్బం గడుపుతున్నారు.

– రమణి కుమారి, గోనెగండ్ల

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



గంజిహళ్లి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

గోనెగండ్ల: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం డీఎస్పీ, సీఐ గంగాధర్‌తో కలిసి మండలంలోని గంజిహళ్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. గ్రామంలోని అందరూ గొడవలకు దూరంగా ఉండి కలిసి మెలసి ఉండాలన్నారు. అలాగే ఇతరులకు ఇబ్బంది కలిగించే పనులు చేయకుండా కుటుంబాలతో సుఖసంతోషాలతో జీవితాలను గడపాలన్నారు. చిన్న పిల్లలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారు జైల్లో శిక్షలు అనుభవిస్తున్నారని, జైల్లో ఉన్న వారి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్న ఘటనలను మనం చూస్తూనే ఉన్నామని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, గ్రామ పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద ఎమ్మిగనూరు - కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి, అలాగే మద్యం సేవించి వాహనం నడిపిన వారికి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి చలానా విధించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రారంభం



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్నఆర్యవైశ్య సంఘం సభ్యులు

కౌతాళం: మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో నూతనంగా నిర్మించిన ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని ఆదివారం ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం రాయచూరు శాఖ అధ్యక్షుడు ఆర్ఎం నరసయ్య శెట్టి తల్లిదండ్రులు విఠోబన్న శెట్టి, హనుమక్కమ్మల జ్ఞాపకార్థం ఈ మండపాన్ని నిర్మించారు. ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ప్రహ్లాదాచార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు రాయచోటి సుధాకర్ శెట్టి, వైఎస్సార్ సీపీ తాలూకా డాక్టర్ల విభాగం అధ్యక్షుడు దశరథ రెడ్డి పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీ వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ(వామ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా 13 మంది డాక్టర్లతో జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కర్నూలు ప్రైమ్ ప్లస్ ఫెర్టిలిటీ సెంటర్, నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి, మధు ఆసుపత్రి, ఆరోగ్యశ్రీ సహకారంతో ప్రముఖ ఎన్నారై కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆదోని పట్టణ అవోపా మరియు వామ్ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. మొత్తం 968 మంది రోగులు ఉచిత చికిత్సలు, సంతాన సాఫల్య కోసం దాదాపు 138 జంటలు హాజరు కాగా, ఒక్కో జంటకు రూ.25 వేలు విలువైన పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. దాదాపు 153 మందికి ఉచిత స్కానింగ్‌లు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అవోపా, వామ్ కార్యదర్శులు రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, వెంకటేష్‌బాబు, సభ్యులు కుప్ప రాజేష్, రత్నయ్య, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘు జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్

ఎమ్మిగనూరుటౌన్: రైతులు పండించిన వేరుశనగ, కంది పంట ఉత్పత్తులకు జిల్లాలో కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్ యార్డుల్లో మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, కోశాధికారి కేసీ జబ్బార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంఘ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు ఎన్నడూ లేని విధంగా ధరలు పతనమయ్యాయన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన మిరప, వేరుశనగ, వరి, కొర్ర, సజ్జ, మొక్కజొన్న, కంది పంటలకు గిట్టుబాటు ధరలు లేవని తెలిపారు. రైతులకు పెట్టుబడులు కూడా చేతికందక అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు నరసింహులు, సమీ, మహబుబ్‌బాషా, హనుమంతు, నాగరాజు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆదోని అర్బన్: అప్పుల బాధ తాళలేక పురుగు మందు సేవించిన పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మారెన్న కుమారుడు రఘు(28) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు..

రఘు చాలా రోజుల నుంచి అప్పులు ఉన్నాయి. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 3వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. గమనించిన బంధువులు ఆదోని ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందరూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య అంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ..

గోనెగండ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన దేవనకొండ మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన బోయ నరేష్ బాబు(31) అనే వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. దేవనకొండ మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన బోయ నరేష్ బాబు, మరో వ్యక్తి భీమేష్‌తో కలిసి డిసెంబర్ 25న కులుమాల గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో నరేష్ తలకు తీవ్ర గాయమైంది. అతడిని కర్నూలు ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య రూప, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

ఆదోని అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తాం

- జగనన్న కాలనీల్లో అవినీతిపై బహిరంగ విచారణ జరిపించాలి
- ఆరోపణలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలి
- వైఎస్సార్‌సీపీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోని టౌన్: ఎమ్మెల్యే పార్థసారథి గారు ఆదోని అభివృద్ధికి తాము అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆదోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల చేయించి ఆదోనిని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు కోరారు. తాము అభివృద్ధిని అడ్డుకోవడంలేదని, అభివృద్ధి చేసే వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆదివారం స్థానిక ద్వారకా ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగనన్న కాలనీలో అవకతవకలు జరిగాయని ఈనెల 6వ తేదీన ఎమ్మెల్యే పార్థసారథి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. అయితే అమాయకుల పేర్లను ఫిర్యాదులో పేర్కొనడం శోచనీయమన్నారు. అభం శుభం తెలియని వైఎస్సార్‌సీపీ నాయకుల పేర్లను ప్రస్తావించడం భావ్యం కాదన్నారు. జగనన్న కాలనీల్లో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే ఎమ్మెల్యే బహిరంగంగా విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. బహిరంగ విచారణ ఆయా పార్టీల నేతల సమక్షంలో చేయాలని, అందుకు తాము సిద్ధమేనని తెలిపారు.

ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు..

ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని, తమ పేర్లపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పట్టణంలోని మండిగిరి పంచాయతీ లేఅవుట్‌లో 68 మంది రైతులకు సంబంధించి 178 ఎకరాల పొలాన్ని పక్కా ఇంటి స్థలం కోసం సేకరించడం జరిగిందన్నారు. రైతులకు ఒక్కొక్క ఎకరానికి రూ.13.50 లక్షలు పరిహారంగా ఇప్పించినట్లు తెలిపారు. అయితే కూటమి నేతలు రైతులకు తక్కువ మొత్తాన్ని అందించి మిగిలిన మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పంచుకున్నారనే నిరాధారమైన ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రైతులతో విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. కూటమి నేతల ప్రకటనలతో తమ పరువు మంట గలిసిందని, తాము ఎలాంటి విచారణకైనా సిద్ధమని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

ఎనిమిది నెలల్లో ఏం అభివృద్ధి చేశారు?

ఎనిమిది నెలల వ్యవధిలో ఆదోనిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో, పరిష్కరించిన సమస్యలు ఏమిటో తెలపాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రశ్నించారు. డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఏదేని ఉన్నా ముఖాముఖిగా మాట్లాడడం, సమస్యను పరిష్కరించడం ఉండాలే తప్పా డైవర్ట్ రాజకీయాలు తగదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు శేషిరెడ్డి, సందీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, మాధవరెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున, ఫయాజ్, అశోక్, నాయకులు దుర్గప్ప, నాగరాజ్, లక్ష్మణ్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పాత హరిజన వాడలో ఆర్‌సీఎం చర్చి నుంచి పెద్ద కమేళా వరకు సిమెంట్ రోడ్డును పునర్నిర్మించాలని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు, సురేష్, ఆంథోని, రాజు డిమాండ్ చేశారు. ఆదివారం రోడ్డుపై సీపీఎం ఆధ్వర్యంలో ఆప్రాంత వాసులు నిరసన తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్డు శిథిలం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారు మాట్లాడుతూ రోడ్డు శిథిలం కావడంతో వృద్ధులు, పిల్లలు, ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

స్వచ్ఛ కార్మికులను నియమించాలి

మంత్రాలయం : ప్రతి గ్రామ పంచాయతీలో ముగ్గురు చొప్పున స్వచ్ఛ కార్మికులను నియమించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేసే పరిస్థితి కానరావడం లేదన్నారు. ముఖ్యంగా తాగునీటి ట్యాంకులు శభ్రతకు నోచుకోక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రెండు వారాలకు ఓసారి ట్యాంకులను శుభ్రం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి సుంకన్న, నాయకులు రాముడు, తిక్కన్న, హబీబ్, నరసింహులు, ఉరకుందు పాల్గొన్నారు.

ఘనంగా సాలబసయ్య తాత జాతర



సాలబసయ్య తాత సన్నిధిలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి



జాతరలో చిన్నారుల కోలాటం

మంత్రాలయం : మండల పరిధిలోని మాధవరం గ్రామంలో బూది బసవేశ్వర స్వామి ఆశీస్సులతో ఆదివారం సాయంత్రం సాలబసయ్య తాత జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. మహోత్సవానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తాత సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. జాతరలో చిన్నారులు, మహిళలు కొలాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, వీరేష్ స్వామి, బీమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



ఘంటసాల పాటలతో మైమరిపిస్తున్న గాయనీ, గాయకులు

ఆదోని అర్బన్: మధుర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక మంగళ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శృతిలయ సంగీత కళాసేవా సమితి ఆధ్వర్యంలో స్వర సంగమం సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. సేవాసమితి గౌరవాధ్యక్షుడు విట్టా రమేష్, అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి చిల్లాలే మల్లికార్జున, రవీంద్రదేశాయ్, సాంబశివరావ్, సుదర్శన్ రెడ్డి, సుజాత, స్వామి తదితరులు ఘంటలసాల చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయనీ, గాయకులు నగేష్, హరి, శివప్రసాద్, మురళి, నరసయ్య, హైదరాబాద్ నుంచి వచ్చిన కళ్యాణి, విజయలక్ష్మి, సరోజ, గాయత్రి, విష్ణుప్రియలు ఘంటసాల మధుర గీతాలను పాడి అలరించారు. తబల పులివెందుల నుంచి హర్షద్‌బాషా, శామ్‌సన్, కీబోర్డు హైదరాబాద్ నుంచి వంశీ, తిరుపతి నుంచి భరద్వాజ్, రిథమ్ ప్యాడ్ ఎమ్మిగనూరు నుంచి కృష్ణలు వాయించారు.

ఉరుకుందలో రుద్ర హోమం



హోమం పూజలు నిర్వహిస్తున్న పండితులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో ఆదివారం రుద్ర హోమాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. అరుద్ర నక్షత్రంలో రుద్రహోమం నిర్వహించడం వల్ల శుభాలు కలుగుతాయని అందుకే ఈ హోమ కార్యక్రమాన్ని ఉరుకుందలో గత మూడు నెలల నుంచి చేపడుతున్నాట్లు ఆయన తెలిపారు. హోమంలో పాల్గొనే జంటలకు దేవాలయం వారు రూ.1500 టికెట్టు నిర్ణయించడంతో చాల మంది భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో పూజలు చేసి, హోమం నిర్వహించి భక్తిని చాటుకున్నారన్నారు. నవగ్రహ మండపారాధన, రుద్ర కలశ ఆవాహన, రుద్రహోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాన్ని శాస్త్రోపేతంగా చేపట్టారు.

పోటెత్తిన భక్తులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకొనేందుకు భక్తులు ఆదివారం పోటెత్తారు. సెలవు రోజు కలిసి రావడంతో పాటు, హోమం ఉండడం వల్ల భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ఈరన్నస్వామిని దర్శించుకున్న కర్ణాటక మంత్రి బోసురాజు

ఈరన్నస్వామి సన్నిధిలో కర్ణాటక రాష్ట్ర మంత్రి

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామిని కర్ణాటక రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ ఈఓ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయన వెంట స్థానిక నేతలు ఉలిగయ్య, సతీష్‌నాయుడు, చిన్న, సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.